క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: టీఎస్‌ఎస్‌పీడీసీఎల్-11 కేవీ ఆజామాబాద్ డివిజన్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా పలు ప్రాంతాల్లో ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపేస్తున్నట్లు ఏడీఈ విజయభాస్కర్ తెలిపారు. ఆర్టీసీ క్రాస్‌రోడ్స్ ఫీడర్ పరిధిలో రిసాల, హరినగర్, అంబేడ్కర్‌నగర్, అచ్చయ్యనగర్, ఏఆర్ కేనగర్ తదితర ప్రాంతాల్లో ఉదయం 9.30 గంటల నుంచి 12 వరకు, లేపాక్షి ఫీడర్ పరిధిలో ఎన్‌బీకే ఎస్టేట్ తదితర ప్రాంతాల్లో 12 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు, దయారామార్కెట్ ఫీడర్ పరిధిలో దయారా మార్కెట్, హరినగర్, సాగర్‌లాల్ ఆసుపత్రి, రిసాల, తాడి కంపౌండ్ తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం 2.30 గంటల నుంచి 5 గంటల వరకు ఆజామాబాద్ ఫీడర్ పరిధిలో రాంనగర్, గరండా అపార్టుమెంట్, శ్రీనివాస టెక్స్‌టైల్స్ తదితర ప్రాంతాల్లో 3 గంటల నుంచి 5 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపేస్తున్నట్లు విద్యుత్ అధికారులు ప్రకటించారు.

11న దర్బార్ మైసమ్మ బోనాలు

కాచిగూడ: బర్కత్‌పుర పీఎఫ్ కార్యాలయంలోని దర్బార్ మైసమ్మ ఆలయంలో ఈనెల 11న నిర్వహించే బోనాల వేడుకలకు ఆలయాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలు, ముగ్గులు వేసి సిద్ధం చేస్తున్నారు. ఆలయ గోపురాన్ని అందంగా రంగులతో అలంకరించారు. మంగళవారం ఉదయం 6:30 గంటలకు పూజహారతి, 7:30 కి అభిషేకంతో పూజా కార్యక్రమాలు ప్రారంభమవుతాయని ఆలయ కమిటీ చైర్మన్ పెండ్యాల రాంబాబు తెలిపారు. 9 గంటలకు అర్చనలు అనంతరం అమ్మవారి దర్శనం ఉంటుందన్నారు. 10:30 గంటల నుంచి స్థానికులు అమ్మవారికి బోనాలు, తొట్టెలు సమర్పిస్తారని తెలిపారు. అనంతరం భక్తులకు అన్నదాన వితరణ ఉంటుందన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

కాచిగూడ: యశోద ఆసుపత్రి ఆధ్వర్యంలో శనివారం ఉదయం 11 గంటలకు కాచిగూడలోని మున్నూరుకాపు విద్యార్థి వసతి గృహం మెడికల్ అండ్ హెల్త్ సెంటర్‌లో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి కార్డియాలజిస్టు డాక్టర్ సంతోష్‌కుమార్‌తో కలిసి వైద్య బృందం పాల్గొని రోగులకు వైద్య సేవలు అందిస్తారని ఆయన తెలిపారు. వివరాలకు 9640461561ను సంప్రదించాలని కోరారు.

కేంద్రమంత్రి ప్రత్యేక పూజలు



నల్లకుంట: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితులైన కేంద్రమంత్రి జి. కిషన్‌రెడ్డి తొలిసారిగా గురువారం సాయంత్రం బాగ్ అంబర్‌పేటలోని షిరిడీ సాయిబాబా ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయనను సంస్థాన్ పాలక మండలి సభ్యులు ఘనంగా సన్మానించారు. వెంకట్‌రెడ్డి, స్థానిక కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డి తదితరులున్నారు.

ప్రజల సహకారంతోనే నేరాలు అదుపు

కాచిగూడ: పోలీసులు, ప్రజలకు మధ్య సత్సంబంధాలు ఉన్నప్పుడే నేరాలను అదుపు చేయొచ్చని నారాయణగూడ ఇన్‌స్పెక్టర్ జి.శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం కాచిగూడ డివిజన్, విక్రమ్‌నగర్ యూత్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఇన్‌స్పెక్టర్ అభినందించారు. నరేష్, విజయకుమార్, కిషోర్, బీ.ఆర్.కిరణ్‌కుమార్, ఎం.శివరాజ్, ఎస్.వేణుగోపాల్, ఎం.సిద్ధిరాజ్, జగదీష్, ప్రకాష్, మంజుల, జే.శాలిని, జీవన్, రాకేష్, భరత్, రాము, వంశీకృష్ణ, కార్తీక్, భరత్, మనోజ్, నాగేశ్వర్‌రావు, యాదమ్మ, పాల్గొన్నారు.

బీసీలకు 63 శాతం సీట్ల కేటాయింపు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: చట్టసభల్లో బీసీలకు 63 శాతం సీట్లు కేటాయించినట్లు మన టీఆర్ఎస్ పార్టీ అధినేత టైగర్ పోతు అశోక్‌నేత తెలిపారు. 2023లో రాష్ట్రంలో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో జనాభా దామాషా ప్రకారం బీసీలు 60 శాతం ఉన్నందున బీసీలకు మా పార్టీ రాష్ట్ర వ్యాప్తంగా 63 సీట్లు కేటాయిస్తున్నామన్నారు. ఎస్సీలకు 22, ఎస్టీలకు 19, ఓసీలకు 15 సీట్లు కేటాయించబోతున్నట్లు వివరించారు. శుక్రవారం బాగ్‌లింగంపల్లిలోని మన టీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీ మేధావులు, కవులు, కళాకారులు, రచయితలు మన టీఆర్ఎస్ పార్టీకి మద్దతు తెలపాలని కోరారు. సంతోష్‌కుమార్, శరత్‌బాబు, స్వామిగౌడ్, ప్రభాకర్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని సభను విజయవంతం చేయండి

నల్లకుంట: నేడు వరంగల్‌లో జరిగే ప్రధానమంత్రి నరేంద్రమోదీ సభకు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు వనం రమేష్ పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాభివృద్ధి కోసం చేపట్టిన పనులను వివరించేందుకు ఈ సభ దోహదపడుతుందని పేర్కొన్నారు. ప్రధాని సభకు హైదరాబాద్ సెంట్రల్ జిల్లా నుంచి ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు.

చివరి దశకు పార్కుల సుందరీకరణ పనులు

- సర్వాంగ సుందరంగా రూపుదిద్దుకుంటున్న నరేంద్ర పార్కు
- త్వరలోనే వినియోగంలోకి పార్కులు



స్థానిక కాలనీవాసులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

నల్లకుంట: నియోజక వర్గంలో చేపట్టిన పార్కుల సుందరీకరణపనులు చివరి దశకు చేరాయని త్వరలోనే వాటిని ప్రారంభించి ప్రజల వినియోగంలోకి తీసుకొస్తామని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తెలిపారు. శుక్రవారం నల్లకుంట డివిజన్ పరిధిలోని నరేంద్ర పార్కును ఎమ్మెల్యే సందర్శించారు. ఈ సందర్భంగా పార్కులో పచ్చటిలాన్ ఏర్పాటు, పూల మొక్కలు నాటడం, వాకింగ్ పాత్ నిర్మాణం, ఫౌంటిన్, పలు క్రీడా పరికరాల ఏర్పాటు, పార్కు చుట్టూ.. ఐరన్ ఫెన్సింగ్, ఆర్చ్ ఏర్పాటు తదితర సుందరీకరణ పనులను స్థానికులతో కలిసి పరిశీలించి మాట్లాడారు.

- బడ్జెట్ నుంచి మంజూరైన నిధులతో నియోజకవర్గంలోని పార్కుల సుందరీకరణపనులు చేపట్టామన్నారు.
- కాలనీవాసుల అభిరుచి మేరకే ఆయా పార్కుల్లో మౌలిక సదుపాయాలకల్పనలో భాగంగా సుందరీకరణ పనులు చేపడుతున్నామన్నారు.
- పార్కుల ఆధునికీకరణ పనులను నిర్ణీత సమయంలో పూర్తి చేయించాలని ఉద్యాన అధికారులకు సూచించారు.
- పార్కులో జరుగుతున్న సుందరీకరణ పనులపై సంతృప్తిని వ్యక్తం చేసిన నరేంద్ర పార్కు స్థానికులు పార్కు సుందరీకరణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నందుకు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఉద్యానవన శాఖ అధికారులు, నరేంద్ర పార్కు కాలనీ అధ్యక్షుడు రాజేందర్, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు మేడి ప్రసాద్, నాయకులు భాస్కర్‌గౌడ్, శంకర్, అడ్వకేట్ సత్యనారాయణ, కాలనీవాసులు పాల్గొన్నారు.

బోనాల ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్, ఆలయ కమిటీ చైర్మన్

ముషీరాబాద్: నియోజకవర్గంలో త్వరలో జరిగే బోనాల ఉత్సవాలకు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అమ్మవారి ఆలయాల వద్ద ఘనంగా ఏర్పాట్లు చేస్తున్నామని ఎమ్మెల్యే ముఠా గోపాల్ తెలిపారు. శుక్రవారం ముషీరాబాద్ మహంకాళి దేవాలయ బోనాల ఉత్సవాల పోస్టర్‌ను ఎమ్మెల్యే ఆలయ కమిటీ చైర్మన్ ఎయిర్‌టెల్ రాజుతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రసిద్ధిగాంచిన దేవాలయంలో ఈ నెల 9 నుంచి ప్రారంభమయ్యే అమ్మవారి ఘటాల ఊరేగింపు, 16న బోనాల ఉత్సవాలు, 17న భవిష్యవాణి తెలిపే రంగం కార్యక్రమానికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రతి ఆలయానికి బోనాల ఉత్సవాల ప్రత్యేక నిధులను అందజేస్తున్నామన్నారు. ప్రజలు ఐక్యంగా ప్రశాంత వాతావరణంలో బోనాల పండుగను నిర్వహించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. బీఆర్ఎస్ నాయకులు ముఠా జైసింహ, ఆలయ కమిటీ ధర్మకర్తలు పూస గోరఖ్‌నాథ్, సదానంద్‌ముదిరాజ్, బల్లా రూపాశ్రీ, రాజు, కమలాకర్‌రెడ్డి, రామకృష్ణయాదవ్, ఆలయ మాజీ చైర్మన్ సంగిశెట్టి రాజ్‌కుమార్, నాయకులు శివముదిరాజ్, దీన్‌దయాల్‌రెడ్డి పాల్గొన్నారు.

పీటీసీని మరింత మెరుగ్గా తీర్చిదిద్దుతాం



పీటీసీ ప్రిన్సిపాల్ మధుకర్ స్వామికి పూలమొక్క అందజేస్తున్న సిబ్బంది

అంబర్‌పేట: పోలీస్ ట్రైనింగ్ సెంటర్ (పీటీసీ), దాని పరిసరాల నిర్వహణ అభినందనీయమని అంబర్‌పేట పోలీస్ ట్రైనింగ్ సెంటర్ ప్రిన్సిపాల్ మధుకర్‌స్వామి అన్నారు. శుక్రవారం అంబర్‌పేటలో విశాలంగా ఉన్న పోలీస్ శిక్షణ కేంద్రాన్ని ఎంతో బాధ్యతతో పారిశుద్ధ్యం, ఇతర అంశాల్లో నిర్వహిస్తున్న సిబ్బందిని ఆయన ప్రత్యేకంగా సన్మానించి అభినందించారు. శిక్షణ కోసం వచ్చే అభ్యర్థులకు అహ్లాదకర వాతావరణం, నాణ్యమైన శిక్షణను అందించేందుకు కృషి చేస్తానన్నారు. విధులు నిర్వహిస్తున్న సిబ్బంది ప్రీతమ్, మహ్మద్ ఖాసీం ఖాన్, సంతోష్‌కుమార్, నాగరాజు, గండయ్య, పుణ్యవతి తదితరులను సత్కరించారు.

ఘనంగా వీడ్కోలు..

అంబర్‌పేట పోలీస్ ట్రైనింగ్ సెంటర్‌లో విధులు నిర్వహిస్తున్న ఇన్‌స్పెక్టర్ ఎ.శ్రీనివాస్ బదిలీ కావడంతో ఆయనను ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. వైస్ ప్రిన్సిపాల్ పిచ్చయ్య, డీఎస్పీ చంద్రశేఖర్‌లు పాల్గొన్నారు.

బాలికలు ఉన్నత చదువులు చదవాలి



నూతన ప్రిన్సిపాల్ లావణ్య కుమారిని అభినందిస్తున్న కళాశాల లెక్చరర్స్

కాచిగూడ: విద్యతోనే సమాజంలో మార్పు వస్తుందని తెలంగాణ యువతి మండలి, శ్రీమతి ఎ.శ్యామలదేవి మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ బి.లావణ్య కుమారి అన్నారు. మహిళా కళాశాల ప్రిన్సిపాల్, ప్రొఫెసర్ సీహెచ్.వెంకటరమణదేవీ పదవీవిరమణ చేయడంతో వైస్ ప్రిన్సిపాల్‌గా ఉన్న లావణ్య ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా శుక్రవారం కళాశాల లెక్చరర్స్ విద్యార్థులు ఆమెను అభినందించి ఘనంగా సత్కరించారు. బాలికలు మధ్యలోనే చదువు నిలిపేయకుండా ఉన్నత చదువులు చదవాలని ఆకాంక్షించారు. బాలికల ఉన్నత విద్యకు కళాశాల యాజమాన్యం ఎంతో కృషి చేస్తుందన్నారు. లెక్చరర్స్ దీప్తి, శిరీష, దీపానాయక్, విద్యార్థులు, సిబ్బంది, తదితరులున్నారు.

వినతిపత్రం అందజేత



కార్పొరేటర్ పావనీవినయ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

చిక్కడపల్లి: గాంధీనగర్ డివిజన్‌లోని జవహర్‌నగర్ కమ్యూనిటీహాల్ నిర్వహణను ఎస్ఆర్‌టీ జవహర్‌నగర్ పరిరక్షణ కమిటీకి అప్పగించాలని కోరుతూ.. కమిటీ సభ్యులు డివిజన్ కార్పొరేటర్ ఎ.పావనీవినయ్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు కార్పొరేటర్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేసిన కమిటీ అధ్యక్షుడు నర్మెట్ట మల్లేష్, ప్రధాన కార్యదర్శి నాగేశ్వర్‌రావులు మాట్లాడుతూ.. ప్రస్తుతం కమ్యూనిటీహాల్ మున్సిపల్ ఆధీనంలో ఉందన్నారు. శుభకార్యాలు, ఇతర సమావేశాలు నిర్వహించుకునేందుకు కమ్యూనిటీహాల్ అద్దె రూ.10వేలు వసూలు చేస్తున్నా.. మెయింటెనెన్స్‌లో పూర్తిగా విఫలమయ్యారని ఆరోపించారు. కాగా కమ్యూనిటీహాల్ నిర్వహణ తమ కమిటీకి అప్పగించాలని కార్పొరేటర్‌ను కోరగా ఆమె సానుకూలంగా స్పందించినట్లు వివరించారు. సీసీ కెమెరాలు తదితర సౌకర్యాలు కల్పించాలని కార్పొరేటర్‌కు విన్నవించామన్నారు. బీజేపీ నగర నాయకుడు వినయ్‌కుమార్, కమిటీ సభ్యులు కృష్ణ, దేవయ్య, జితేందర్‌నాయుడు, దినేష్‌కుమార్, శ్రీకాంత్‌కుమార్ పాల్గొన్నారు.

ఒకరి సంప్రదాయాలను మరొకరు గౌరవించుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న సెంట్రల్ జోన్ డీసీపీ వెంకటేశ్వర్లు

ముషీరాబాద్: ఒకరి సంప్రదాయాలను మరొకరు గౌరవించుకున్నప్పుడే శాంతియుత వాతావరణం ఏర్పడుతుందని సెంట్రల్ జోన్ డీసీపీ వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం సాయంత్రం భోలక్‌పూర్‌లోని రంగానగర్‌లో పోలీస్ ఔట్‌పోస్టును ఎమ్మెల్యే ముఠా గోపాల్, కార్పొరేటర్ గౌసుద్దీన్‌లతో కలిసి డీసీపీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శాంతిని కాపాడేలా పోలీసులు సేవలు అందిస్తున్నారని వారికి ప్రతి పౌరుడు సహకరించాలని కోరారు. 24 గంటలు పోలీస్ ఔట్‌పోస్టుల ఒక హెడ్ కానిస్టేబుల్, ఇద్దరు కానిస్టేబుల్‌లు విధులు నిర్వహిస్తారన్నారు. ఫిర్యాదుదారులు పోలీస్‌స్టేషన్ రాకుండానే పోలీస్ ఔట్‌పోస్టులో తమ ఫిర్యాదును అందజేయవచ్చని సూచించారు. ఏసీపీ యాదగిరి, ముషీరాబాద్ సీఐ జహంగీర్‌యాదవ్, బీఆర్ఎస్ యువజన విభాగం నగర నాయకుడు ముఠా జైసింహ, భోలక్‌పూర్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రావు, గంగపుత్ర సంఘం అధ్యక్షుడు కే.ఎం.శంకర్, డీఐ ప్రశాంత్, ఎస్సైలు ప్రసాద్‌రెడ్డి, కృష్ణ, ప్రేమ్‌కుమార్, నాయకులు సాయి, ఆనంద్‌రావు, ఉమాకాంత్, దీన్‌దయాల్‌రెడ్డి పాల్గొన్నారు.

రోడ్డు సమస్యను పరిష్కరించాలి

అంబర్‌పేట: డివిజన్‌లో అంతర్గత రోడ్లను తక్షణమే మరమ్మతులు చేయాలని బాగ్‌అంబర్‌పేట డివిజన్ కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డి అధికారులకు సూచించారు. శుక్రవారం అంతర్గత రోడ్డు సమస్యపై ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదుతో ఆమె డివిజన్‌లోని భరత్‌నగర్, దోభిగల్లీ, పోచమ్మ బస్తీ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. రాబోయే బోనాల ఉత్సవాలను పురస్కరించుకుని అంతర్గత రోడ్లు, డ్రైనేజీ, పారిశుద్ధ్యం తదితర సమస్యలు లేకుండా చూడాలని ఆమె అధికారులకు సూచించారు. జలమండలి, జీహెచ్‌ఎంసీ అధికారులతో పాటు బీజేపీ నాయకులు వెంకట్‌రెడ్డి, చుక్క జగన్, అజయ్‌కుమార్, వెంకటేష్ ముదిరాజ్, బస్తీ నాయకులు శ్రీహరి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు కృపారావుకు ఘన నివాళి



నివాళులర్పిస్తున్న టీపీసీసీ ఉపాధ్యక్షుడు నిరంజన్ తదితరులు

ముషీరాబాద్: గ్రేటర్ హైదరాబాద్ నగరంలో కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి కృపారావు చేసిన సేవలు మరువలేనివని పలువురు సీనియర్ కాంగ్రెస్ నేతలు కొనియాడారు. శుక్రవారం మాజీ నగర అధ్యక్షుడు కృపారావు వర్ధంతి సందర్భంగా గాంధీనగర్ వై జంక్షన్ వద్ద ఆయన కుమారుడు, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు కన్నా డానియల్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి ముఖ్య అతిథిగా హాజరైన టీపీసీసీ ఉపాధ్యక్షులు నిరంజన్, ఆల్ ఇండియా ఫిషర్‌మెన్ కాంగ్రెస్ కార్యదర్శి బిజ్జి శత్రు హాజరై నివాళులర్పించారు. సీనియర్ కాంగ్రెస్ నాయకులు శ్రీరాములయాదగిరి, కవాడిగూడ రాజు, గజ్జల సత్యనారాయణ, రుషికేష్, శీలం సత్యనారాయణ, అంజిరెడ్డి, మహ్మద్ ఖదీర్‌అలీ, రామకృష్ణ, రావుల శ్రీకాంత్, బలరామ్‌రెడ్డి, నవీన్, చారి, పీటర్, మధు, రాజ్‌కుమార్, రాము తదితరులున్నారు.

చిక్కడపల్లి: నగర కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు కృపారావు సేవలు విలువైనవని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నిరంజన్, ఆలిండియా ఫిషర్‌మెన్ కాంగ్రెస్ కార్యదర్శి బిజ్జిశత్రులు అన్నారు. శ్రీరాముల యాదగిరి, గజ్జల సత్యనారాయణ, రుషికేష్, సత్యనారాయణ, అంజిరెడ్డి, మహ్మద్ ఖదీర్‌అలీ, రామకృష్ణ, రావుల శ్రీకాంత్, బలరామ్‌రెడ్డి, నవీన్, చారి, పీటర్, మధు, రాజ్‌కుమార్, రాము తదితరులున్నారు.

ఇనాక్ సాహితీ సప్తాహం విజయవంతం



చిక్కడపల్లి: గత ఆరు రోజులుగా త్యాగారాయగాన సభలోని కళాసుబ్బారావు కళావేదికపై గానసభ నిర్వహణలో జరుగుతున్న వేంకటేశ్వర విశ్వవిద్యాలయం పూర్వ వీసీ ఆచార్య కొలకలూరి ఇనాక్ సాహితీ సప్తాహం ముగిసింది. శుక్రవారం రాత్రి జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ శ్రీనివాస్ పాల్గొని ఇనాక్ రచించిన కథలు ఆంగ్ల అనువాదం అల్మ్స్ ఆఫ్ పార్డన్ సంపుటిని ఆవిష్కరించి మాట్లాడారు. ఇనాక్ సాహిత్యాన్ని కేవలం దళితవాదంగా చూడరాదని సామాజిక, మానవీయ కోణంలో చూడాలన్నారు. గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి కార్యవర్గ నిర్వహణలో జరపడం సమాభావనకు నిదర్శనమన్నారు. సినీ రచయిత రేణుమాను భాష, ఆంగ్ల అనువాదకులు అల్లాడి ఉమ శ్రీధర్, బడేసాబ్‌లు పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన

ముషీరాబాద్: రాంనగర్ సెయింట్ పాయిస్‌స్కూల్‌లో సైబర్ క్రైం, 'గుడ్ టచ్–బ్యాడ్ టచ్' తదితర వాటిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. స్కూల్ ప్రిన్సిపాల్ సిస్టర్ రెవరెండ్ లిండా జెరాల్డ్, రాంనగర్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షులు రావులపాటి మోజెస్ ఆధ్వర్యంలో జన్నహాస్ స్వచ్ఛంద సంస్థ సహకారంతో పిల్లలకు అవగాహన కల్పించారు. లక్ష్మి, అయేషా, కీర్తి, బిందు, అనూష, ప్రత్యూష, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో బాలుడి మృతి

అంబర్‌పేట: ఉదయం నిద్రలేచి బయటకు వెళ్లి వస్తానని ద్విచక్ర వాహనంపై ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఓ బాలుడు రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ.. మృతి చెందాడు. ఈ ఘటన శుక్రవారం ఉదయం అంబర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ అశోక్ తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ జిల్లా పాలకుర్తికి చెందిన గాదెం కుమారస్వామి, అరుణ దంపతులు. కాగా జీవనోపాధికోసం నగరానికి వచ్చి అంబర్‌పేట్ పటేల్‌నగర్‌లో నివాసం ఉంటున్నారు. వీరికి ఇద్దరు కుమారులు, ఓ కుమార్తె. పెద్ద కుమారుడు రేవంత్(16) ఇటీవలే పదోతరగతి ఉత్తీర్ణుడయ్యాడు. ఇంటర్మీడియట్‌లో చేరేందుకు కళాశాలల ఎంపికకోసం ప్రయత్నిస్తున్నాడు. శుక్రవారం ఉదయం ఇంటి నుంచి బైక్ తీసుకుని వెళ్లాడు. పటేల్‌నగర్ చౌరస్తాలో ఎదురుగా వచ్చిన ద్విచక్ర వాహనాన్ని తప్పించబోయి పక్కనే ఉన్న విద్యుత్ స్తంభానికి ఢీ కొట్టి కిందపడిపోయాడు. ఈ ప్రమాదంలో తలకు తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ.. మృతిచెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బ్రిడ్జి నిర్మాణానికి ప్రత్యేక చొరవ



సర్వే పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

అంబర్‌పేట: మూసారాంబాగ్ బ్రిడ్జి నిర్మాణానికి తనవంతు చొరవ తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తెలిపారు. శుక్రవారం బ్రిడ్జి నిర్మాణానికి అధికారులు చేపట్టిన సర్వేకు ఎమ్మెల్యే హాజరై పరిశీలించారు. భవిష్యత్తులో ఇబ్బందులు తలెత్తకుండా ప్రణాళికాబద్ధంగా రూపొందించాలని ఆయన అధికారులకు సూచించారు. గత వర్షాకాలంలో తలెత్తిన ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని మంత్రి కేటీఆర్ బ్రిడ్జి మంజూరు చేయించారన్నారు. ఈ సర్వేలో సమీపంలో ఉన్న దుర్గానగర్ వాసులకు ఇబ్బందులు తలెత్తకుండా కృషి చేస్తానన్నారు. బ్రిడ్జి నిర్మాణంతో నష్టపోయే నివాస యజమానులకు నోటీసులు జారీచేసి నష్టపరిహారం అందేలా కృషి చేస్తానన్నారు. ప్రజలు ఎలాంటి ఆందోళనలకు గురికావొద్దని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. ప్రాజెక్టు అధికారులు గోపాల్, రేణుకా, ప్రశాంత్, సాయిబాబా తదితరులున్నారు.

కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుల నియామకం



అనిల్‌కుమార్‌యాదవ్‌తో భోలక్‌పూర్ డివిజన్ అధ్యక్షుడు జఫీరుద్దీన్



రాంనగర్ డివిజన్ అధ్యక్షుడితో మాజీ ఎంపీ అంజన్‌కుమార్‌యాదవ్

ముషీరాబాద్: ముషీరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షులను పీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి నియమించారు. రాంనగర్ డివిజన్ అధ్యక్షులుగా వరుసగా రెండోసారి రిసాలగడ్డకు చెందిన జూహేర్‌హుస్సేన్‌ను నియమించారు. భోలక్‌పూర్ డివిజన్ అధ్యక్షుడిగా మహ్మద్ జఫీరుద్దీన్ నియమితులయ్యారు, కవాడిగూడ డివిజన్ అధ్యక్షుడిగా పోతరాజు భాస్కర్, ముషీరాబాద్ డివిజన్ అధ్యక్షుడిగా పెండెం శ్రీనివాస్, గాంధీనగర్ డివిజన్ అధ్యక్షుడిగా అభిషేక్‌రెడ్డి, అడిక్‌మెట్ డివిజన్ అధ్యక్షుడిగా జె.తిరుమలరావులను నియమించారు. ఈ సందర్భంగా రాంనగర్ డివిజన్ అధ్యక్షులుగా నియమితులైన జూహేర్‌హుస్సేన్ శుక్రవారం సికింద్రాబాద్ మాజీ ఎంపీ అంజన్‌కుమార్‌యాదవ్‌ను కలిశారు. రాంనగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ ఆర్.కల్పనాయాదవ్, అమ్జద్‌హుస్సేన్, గజ్జల రుషికేష్, వీ.డి.కృష్ణ తదితరులున్నారు.

రెండోసారి భోలక్‌పూర్ డివిజన్ అధ్యక్షుడిగా..

భోలక్‌పూర్ డివిజన్ అధ్యక్షుడిగా రెండోసారి జఫీరుద్దీన్‌ను నియామకంపై పలువురు కాంగ్రెస్ నేతలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డికి వర్కింగ్ ప్రెసిడెంట్ అంజన్‌కుమార్‌యాదవ్, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ మల్లు రవి, అనిల్‌కుమార్ యాదవ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. అల్లావుద్దీన్, మహ్మద్ ఇబ్రహీం, జమీలుద్దీన్, మాజీ కార్పొరేటర్ వాజీద్‌హుస్సేన్, ఖాజామొహియుద్దీన్ పాల్గొన్నారు.

బీసీలకు చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలి



మాట్లాడుతున్న దాసు సురేష్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: బీసీలకు చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్‌ను అమలు చేయాలని దీనికి ప్రత్యేక చట్టాన్ని తీసుకురావాలని బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షులు దాసు సురేష్ అన్నారు. శుక్రవారం బాగ్‌లింగంపల్లిలోని రాజ్యాధికార సమితి కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. స్వాతంత్య్రం వచ్చి 75 ఏళ్లు దాటిన బీసీలకు రాజ్యాధికారం దక్కలేదని ఆవేదన వ్యక్తం చేశారు. చట్టసభల్లో తగిన ప్రాతినిధ్యం లభించడం లేదన్నారు. బీసీలపై అణచివేత ధోరణి మానుకోవాలని లేదంటే వచ్చే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం బీసీ కులవృత్తులకు ప్రకటించిన లక్ష రూపాయల పథకం అశాస్త్రీయంగా ఉందని విమర్శించారు. ఈ పథకానికి కేవలం వంద కోట్లు కేటాయించి ఆ సాయాన్ని కేవలం పది వేల మందికే పరిమితం చేయడం సరికాదన్నారు. ప్రభుత్వం నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వేలో నమోదైన 45 లక్షల బీసీ కుటుంబాలకు ఈ సాయం ఏమేరకు సరిపోతుందో స్పష్టం చేయాలన్నారు. దళితులకు లేని నిబంధనలు బీసీ కులవృత్తుల లక్ష పథకంలో ఎలా వర్తింపజేస్తారని ప్రశ్నించారు. 152 కులాలుగా ఉన్న బీసీలలో కేవలం 14 కులాలకు మాత్రమే లక్ష ఆర్థిక సహాయాన్ని ప్రకటించడం బాధాకరమన్నారు. దళిత బంధు తరహాలో బీసీలకు సైతం పదిలక్షల పథకాన్ని వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. రాజ్యాధికార సమితి గౌరవ అధ్యక్షులు దొంత ఆనందం, కార్యదర్శి మామిళ్ల సుధాకర్, ఉసిరికాయల సిద్ధార్థగౌడ్, రాష్ట్ర నాయకులు సాయిబాబా, రాజు తదితరులున్నారు.

ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించాలి



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్‌యాదవ్

కాచిగూడ: ప్రజా సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యం చేయొద్దని కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్‌యాదవ్ అధికారులకు సూచించారు. ప్రజా సమస్యలను గుర్తించి సత్వరమే పరిష్కరించాలన్నారు. శుక్రవారం జలమండలి అధికారులు, సిబ్బందితో కలిసి ఆమె డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో పర్యటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా చెప్పల్‌బజార్‌లో కలుషిత తాగునీటి పైప్‌లైన్‌లను పరిశీలించిన కార్పొరేటర్ సత్వరమే పరిష్కరించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. జలమండలి ఏఈ భావన, వర్క్ ఇన్‌స్పెక్టర్ వెంకటేష్‌యాదవ్, బీజేపీ నేతలు సుభాష్ పటేల్, ప్రతిభ, ఆర్.సంతోష్, లక్ష్మి, లావణ్య, రవియాదవ్, కృష్ణ, అజయ్, చందు తదితరులున్నారు.

బీసీల రాజకీయ ప్లీనరీని విజయవంతం చేయండి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మాదేశి రాజేందర్

ముషీరాబాద్: ఎల్‌బీనగర్ మన్సూరాబాద్‌లోని ఓ కన్వెన్షన్‌హాల్‌లో జూలై 15న ఉదయం 10 గంటలకు జరిగే బీసీల రాజకీయ ప్లీనరీని విజయవంతం చేయాలని బీసీ సంక్షేమ సంఘం గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు మాదేశి రాజేందర్ కోరారు. శుక్రవారం ముషీరాబాద్‌లోని సంఘం కార్యాలయంలో ప్లీనరీ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాజేందర్ మాట్లాడుతూ.. బీసీలందరు ఏకమైతే రాజ్యాధికారం సాధించవచ్చని బీసీలు ఓటును ఆయుధంగా మలచి రాజ్యాధికారం దిశగా ముందుకురావాలన్నారు. ముషీరాబాద్ నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు మాదేశి కళావతి, కిరణ్‌చారి, గోవింద్‌గంగపుత్ర, మహేష్ తదితరులున్నారు.

ప్రకృతి సంరక్షణ అందరి బాధ్యత



జి.రామలింగం 'ఐఎఫ్ఎస్'కు మొక్కను అందజేస్తున్న ఉపాధ్యాయులు

కాచిగూడ: ప్రకృతిని సంరక్షించేందుకు ప్రజలందరూ భాగస్వాములై పర్యావరణాన్ని కాపాడుకుంటేనే మనమంతా ఆరోగ్యంగా ఉంటామని చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్, ట్రీ ప్రొటెక్షన్ కమిటీ ఇన్‌ఛార్జ్ చైర్మన్ జి.రామలింగం (ఐఎఫ్ఎస్) అన్నారు. శుక్రవారం హిమాయత్‌నగర్‌లోని ఆక్స్‌ఫర్డ్ గ్రామర్ హైస్కూల్‌లో వనమహోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని పాఠశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. గ్లోబల్ వార్మింగ్‌ను నివారించి కాలుష్యాన్ని తగ్గించేందుకు చెట్లు ఉత్తమమైన మార్గం అన్నారు. ప్రకృతిని సంరక్షిస్తామంటూ విద్యార్థులు, ఉపాధ్యాయులు ప్రతిజ్ఞ చేశారు. ఉపాధ్యక్షురాలు మణికొండ ప్రార్థన, కరస్పాండెంట్ కె.ప్రభాకర్, ప్రధాన ఉపాధ్యాయురాలు రామాంజుల, ఫహ్మిదాషామీన్, ఫాతిమాఖాజిమ్ తదితరులు పాల్గొన్నారు.

రెజ్లర్లపై వేధింపులకు పాల్పడిన ఎంపీని అరెస్ట్ చేయాలి



సుందరయ్య విజ్ఞాన కేంద్రం: లైంగిక వేధింపులకు పాల్పడిన ఎంపీని వెంటనే అరెస్ట్ చేయాలని ఐద్వా జాతీయ ఉపాధ్యక్షురాలు జగమతి సాంగ్‌వాన్ అన్నారు. శుక్రవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఐద్వా రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో బీజేపీ ఎంపీ బ్రిజ్‌భూషణ్ అరెస్టు ఎప్పుడు, రెజ్లర్ల న్యాయ పోరాటానికి ఐద్వా మద్దతు అనే అంశంపై సెమినార్ జరిగింది. ఈ సందర్భంగా జగమతి సాంగ్ వాన్ మాట్లాడుతూ.. దేశానికి గౌరవం, ప్రతిష్టను తీసుకొచ్చిన రెజ్లర్లపై వేధింపులకు పాల్పడిన ఎంపీని అరెస్టు చేయకపోవడం బాధాకరమన్నారు. దీనిపై ప్రధానితో పాటు ఇతర మంత్రులు స్పందించకపోవడం విచారకరమన్నారు. నిందితుడిపై 40కి పైగా క్రిమినల్ కేసులు ఉన్నాయని మహిళల భద్రతను బీజేపీ ప్రభుత్వం గాలికి వదిలేసిందని ఆరోపించారు. మల్లు లక్ష్మి, జ్యోతి, హైమావతి, ఆశలత, భారతి పాల్గొన్నారు.